# కో ... బలి

దారికిరు ప్రక్కలా బ్రహ్మజెముడు డొంకలు దట్టంగా బలిసిన గోర్జిలోంచి, బండిజాడీమీద నుండి, ఎక్కుడిగి కుదుపుల్తో నెమ్మదిగా వచ్చి తోటముందాగింది— జీపు !

తోటలో పిల్లలు 'చిరత-బిళ్ల' ఆడుతున్నారు. చిరత పట్టుకొని బిళ్లని ఎదురుగున్న పెంటిగాడివైపు చిమ్మిన సింవాద్రి, బొండీకాడ చిరత ఆడిస్తూ పెంటిగాడివైపు చూస్తున్నాడు బిళ్లకోసం. అప్పుడు కన్పించింది... ఆ ముందే ఆగిన జీపు !

జీపు డ్రైవరు పిప్పీ మనిపించాడు హారను. చిరత అక్కడ బొండీ కాడ వొదిలేసి... సింవాద్రి—

''ఒరె, జీపీ వొచ్చిందిరా, జీపీ, రాంద్రా...'' అని పరుగెట్టాడు.

వాడెనకాలే మిగతా పిల్లలూ పరిగెట్టారు. జీపు వద్దకి చేరారు. డ్రైవరు వారిని చంద్రంపేటకి తోవడిగాడు.

''ఇదిగీ తోటవెల్లి అవతలకెల్తే రెండు తోవలొత్తాయి. అందలి వలపల తోవంటెలి పోతె, తిన్నగా, మా ఊరి బుగతల సాలవొత్తాయి. ఆ సాలల కాంచి తిన్నగ నడీది కెలిపోతాది జీపి...'' అని తోవ చెప్పాడు సింవాద్రి !

జీపుకదిలింది. పిల్లలూ దాని వెనుకాలే పరుగెట్టారు.

వంశధార వరద బీభత్సం జరిగి మూడు వారాలైంది. వరదకు గురయిన గ్రామాలలో చంద్రంపేట ఒకటి. మూడువంతుల ఇళ్ల వరదలో కూలిపోయాయి. పశువులు చాలావరకూ కొట్టుకుపోయాయి. ధాన్యాది పంట దినుసులు నేల పాలయ్యాయి. గొల్లోల్ల గొర్రెలూ, కూలోల్ల కోళ్లూ ప్రవాహంలో నిస్సహాయంగా కొట్టుకు పోయాయి. పొలాల నిండా యిసుక దిబ్బలు దిబ్బలుగా పడిపోయింది... రైతు గుండెలపై బండల్లా !

పొలాల్లో యిసుక మేటలు ఎత్తి వెయ్యనిదే తిరిగి సేద్యానుకూలం కాదు. ఇసుక మేటలు ఎత్తివేయట మంటే సముద్రానికేత మెత్తటమే ! ఉండటానికి ఇల్లు లేదు. తినడానికి గింజల్లేవు. గిన్నెల్లేవు, గుడ్డల్లేవు. ఎలా బ్రతకాలో, ఏంజెయ్యాలో అని సతమతమవుతున్నారు బాధితులు !

ప్రభుత్వం వరద బాధితులకు కొన్ని సౌకర్యాలు ప్రకటించింది. మంత్రులూ, అధికార్లూ పర్యటనలు జేసి సానుభూతి కార్చారు. ఇండ్లు గట్టిస్తా మనీ, వృత్తి కళాకారులకు, తిరిగి తమ వృత్తుల కవసరమైన సామగ్రి కొనుక్కునేందుకు సబ్సిడీలోన్లు, రైతులకు ఇసుక మేటలు ఎత్తివేయటానికి సబ్సిడీ లోన్లు యిప్పిస్తామనీ అన్నారు. కేంద్ర, రాష్ట్రీ బృందాలు వరద ప్రాంతాల్లో పర్యటించి నివేదికలు సమర్పించాయి.

రెవిన్యూ శాఖ వారిచ్చిన రికార్డుల ఆధారంతో, యే రైతుకి ఎంత అప్పు అవసరమో, తెలుసుకొనేందుకూ, అప్పు దరఖాస్తులు నింపేందుకూ యీ సంవత్సరంలో— రావటమయ్యింది చంద్రంపేట ఊర్లోకి యీ జీపులో వున్న బ్యాంకువారు !

జీపు నడివీధిలో ఆగింది. పిల్లలు చుట్టూ మూగిపోతుంటే, పెద్దలు వార్ని దూరంగా వుండన్రా-అని కేకేసి, బ్యాంకువారు నాయుడు గారిల్లు చూపమంటే చూపించారు.

నాయుడు గారింటి వరండాలో కుర్చీల్లో కూర్చొని, కరణంగారి

రికార్డు ప్రకారం ఒక్కో రైతునీ పిలిపించి, వివరాలు రాసుకుంటూ, దరఖాస్తులు నింపుతున్నారు బ్యాంకువారు.

ఆ వ్రాసుకుంటున్న పేర్లలో— దాసరి చిట్టెమ్మ వైఫాప్ లేటు చెంద్రయ్య, మార్జినల్ ఫార్మర్, అరవై సెంట్ల పల్లంలో అరఅడుగు ఎత్తు యిసుకదిబ్బ పడింది- అని కర్నం వివరించగా బ్యాంకువారు ఆమెని పిలిపించమన్నారు.

అరవై సెంట్ల మడిసెక్కమీద అరడుగెత్తున యిసక మేట పడిపోడ మొక్కటే గాదు... సిట్టెమ్మకి జరిగిన గోరం ! ఆలూ మగలూ పిల్లల్తో చిలకా గోరింకల్లా బతికే సిట్టెమ్మ కాపురం సితుక్కమంది. కాళ్లురాని పిల్లల్ని, రెక్కలురాని పక్షిపిల్లల్లాటోల్ని ఒదిలేసి, పుట్టెడు దుఃఖంల, బండెడు బాధల్ల ఆడకూతుర్ని ఒగ్గేసి వొరదపాలయినాడు సిట్టెమ్మ పెనిమిటి !

అయిదేళ్ల కిందట అత్తోరింటిల అడుగుపెట్టిన సిట్టెమ్మ, సీకూ సింతా లేకండా, పెనిమిటికి తోడుగా పొలాన పన్జేస్తూ, యిబ్బంది లెరక్కండా బతుకొస్తుండేది ! ఇప్పుడిద్దరి పిల్లల తల్లి అయ్యింది. ఊరు, ఊరు మొత్తమ్మీద ఏలెత్తి సూపనేరు. ముక్కుమీద మసి అనలేరు. అలాగ నలుగుర్లో మంచి అనిపించుకుంది !

అయితేట్లాభం ? మంచోలేటి, సెడ్డోలేటి.... అందరికీ ఒకటే రేవు పెట్టింది తల్లి గంగమ్మ. రాకాసి వొరద సిట్టెమ్మ తాడు తెంపేసింది. సెంద్రయ్య సెల్లి పోనాడు...” అని ఏభయ్యేళ్ల ఓ రైతు చిట్టెమ్మగూర్చి చెప్పాడు.

పందొమ్మిది వందల ఎనభై, సెప్టెంబర్ నెల పద్దెనిమిదో తేదీ ! ఆరోజు వంశధార వుప్పొంగి ప్రళయ తాండవం జేస్తోంది. చంద్రంపేట ఊరి జనాలు కోడికూతకు మేల్కొన్నారనే కంటే, యేటి హోరుకే మేల్కొన్నారనటం సబబు !

చంద్రంపేట యేటి మొగ గోర్జిలోంచి నీరు ఎక్కింది. అది ఊరు నాలుగు వీధులా తిరిగేస్తోంది. ప్రజలు ఆందోళన పడుతున్నారు. కొంత మంది పెద్దలు—

''ఫర్లేదు, ఫర్లేదు. డబ్బయి రెండుల ఒకపాలిలాగే రాలేదా వారద? ఊధుల్లోకి వొచ్చింది. తరాత తీస్సింది. మరేటి ఫర్లేదు. అదీగాక వొంశధారకి పెద్ద వారదరావడం మా తరంల ఎరగం'' అని అంటే, మరికొంతమంది—

''ఎందుకెరగం? బహుధాన్య నామ సంవత్సరం చాలా పెద్ద వార దొచ్చింది. ఎన్నో గ్రామాలు మునిగిపోనాయి-'' అన్నారు.

అయినా, నీరు తీసేస్తుందిలే అనే ధైర్యంతో ఎవ్వరూ ఇళ్లు ఖాళీ చేయలేదింకా. కొంతమంది ఊతగాళ్లు యేటిలో కొట్టు కొస్తున్న కర్రా, కంపా కూడేస్తున్నారు. చిట్టెమ్మ పెనిమిటి గూడా కలప కూడేయటానికి యేటిలోకి వెళ్లాడు.

వీధుల్లో నీటి మట్టం గంట గంటకూ పెరిగిపోతోంది. పిల్లలి ద్దరినీ దగ్గరకు తీసుకొని, అవీ ఇవీ కబుర్లు చెప్తూ, కోళ్లని, ''టూ, ట్టొట్టో'' అని నాలుక పై దవడకి అణిచి విడిచిపెట్టి శబ్దం చేస్తూ పిల్చి, వాట్ని కోళ్ల గూడులో మూసింది.

''సిట్టే, సిట్టే... మర్నాళభంలేదు. ప్రళయ మెలిపోవాత్తంది. గంగ పొంగిపోతంది. గడ్డికుప్పలూ, ఇళ్లకప్పులూ, సామాన్లూ, పశువులూ ఒకపేటి, యేపేటో కొట్టు కొస్తన్నాయి. ఊరు మొగలెల్లి యేరెక్కిపోయి సుట్టూ ముంచీసింది. ఈ ఇంటిలుంతే, అసలే బీటలిచ్చీసిన గోడలు వారద తోసీసినా-తోసేత్తాది. పద, పద! పిల్లల్నెత్తుకో! సావుకారి డాబా ఎక్కిపోడం.'' అని చిట్టెమ్మ భర్త చంద్రయ్య వచ్చి, తొందరచేసి, పెళ్ళాం పిల్లల్ని సావుకారి శంకరయ్య డాబాకి చేర్చాడు.

సావుకారి డాబా అప్పటికే ఊరిజనంతో, పిల్లల యేడ్పుల్తో, పెద్దల శోకాల్తో నిండిపోయింది. చిట్టెమ్మన్నీ, పిల్లల్నీ అక్కడ ఒకమూల కూర్చోమని చెప్పి—

"గిన్నిలా తపేలాలా, ఉన్నకాడికి సామాన్లూ సర్దుకొని ఒటు కొత్తానుండు..." అని బయల్దేరబోయాడు చంద్రయ్య.

అప్పటికే వీధులలో మొలలోతు నీరు జర, జర లాగుతోంది. యంతో చిట్టెమ్మ—

"వొద్దొద్దు. వొద్దెల్లొద్దు. పోతే పోనీ సామాన్లు నీరు తోసేత్తంది. ఈ నీటిల దిగొద్దు..." అని ఒద్దంది.

"ఫర్లేదునేయే. యేడాది కష్టం, ఒకపూట తినీ, ఒకపూట తినకా దాసుకున్న ధాన్నెం గాదిల పోస్నాం. ఎక్కడి సామాన్లక్కడ వుండి పోనాయి. మారకానికి గుడ్డముక్కయినా నేదు. నీకేం బెంగనేదు. ఈపాటి నీటికేటి కొట్టుకుపోము. గబాల్న సర్దికొత్తాను." అని తిరిగి జవాబు వినకుండా, చరచరా నీటిలోకి దిగి ఇంటివైపు వెల్లాడు.

ఆ దిగడం తిన్నగా యింటికెల్లాడు. సరుకులా, సట్రా సర్దినాడు. ధాన్యం గాదెకేదో దాపు పెట్టాడు. చేతిలో బట్టల పెట్టీ, భుజమ్మీద యింకేదో మూటా పట్టుకున్నాడు. ఇంట్లోంచి వీధిలోకొచ్చాడు. అంతే, వరద ఉప్పొంగిసింది. నడీదికొచ్చేసరికి ఎన్నుంచొత్తందో పెద్ద దూలం చెంద్రయ్యని గుభేల్మని గుద్దింది. చంద్రయ్య మరి కన్పించలేదు. దూలం తేలుతూ, మునుగుతూ తిన్నగా వీధిలోంచి, జోలబట్టిలోకి అక్కడ్నించి గెడ్డలోకి కొట్టుకు పోయింది. చంద్రయ్య వస్తాడని చూస్తున్న చిట్టెమ్మ యీ కబురు వినటంతో స్పృహ దప్పిపోయింది!

ఆ పరిస్థితిని గుర్తుతెస్తూ, మళ్లీ మాట్లాడాడు మొదట మాట్లాడిన యాభయి యేళ్ల వృద్ధ రైతు—

"ఎవులి ఎతల్ల ఆలు, ఎవులి బాధల్ల ఆలు వున్నారు. ఆడ

కూతురు సెతను దప్పోయింది. పిల్లలిద్దరూ మీదపడి యేడుత్తన్నారు. నలుగురూ సేరి, పిల్లల్ని దీసి, కూతురు మొగాన నీలు సించగొట్టి కసింత తెప్ప దీర్సినారు. తెప్ప దీర్సింతరాత—

తల్లే, సిట్టెమ్మా! యేడకు. యేడకే యేడకు. గుండెరాయి జేసుకో. దిగాలు పడిపోకు. యేటి జేత్తాం? వారదొచ్చింది. బతుకుల్ని తుడిసీసే వారదొచ్చింది. నిజఁవే! నీకు పెనిమిటి పోనాడు. వుంకోలికి కొడుకు, వుంకోలికి పశివిలా యిలాగందరికీ ఒక తీరవగే బాధ పెట్టింది గానీ వొదిలీలేదు. అందరిమీ అలాగే వున్నాము.

అయితేటి? సచ్చినోలితోటి సచ్చిపోతామా? యేడీడు పధ్నాలుగు రోజులు యేడిసి గూకుంతే మాత్తరం, పోయినోలు తిరిగొత్తారా? ఏటి? తిరిగిరారు. ఇదిగీ పిల్లల్ని సూడు. అలకెలాగా, ఆ గంగమ్మతల్లి తండ్రి దిక్కు లేకండా జేస్సింది. నువ్వూ బెంగపెట్టుకొని పోతే, మరాపిక్కురు గుంటకేటి దిక్కు? లెగు, లెగు, పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకో. పిల్లల్ని దియ్యి అని చెప్పి—

అందరిమీ బోదపరిసాం. అదిగలాగ, ఒకలకొకలిమి ఓదార్పుకొని, దుఃఖం మింగి ఆ కష్టం గట్టెక్కాము. అది దుఃఖంగాదు... నరకం! నట్టింట ధాన్నెలచ్చిమి తిరుగాడే రైతోడూ ఆ వారద పోయింతరాత, పెబుత్వమిచ్చే రెండుకేజీల బియ్యానికి సేట పట్టుకు నిలబడ్డాడు. సిగ్గూ, బిడియం, అవమానం వొదులుకొని, ఆకాశం మీద యేది తిరిగినా, రోడ్డుకాడ కేదొచ్చి ఆగినా...యెవులో యేటో తెచ్చి పంచుతారనే ఆశపడి, ఒంటినిండా కళ్లుచేసి చూసారు జనం!'' అని వివరించాడు.

బ్యాంకువారు సానుభూతిగా వింటున్నారు. చిట్టెమ్మ వచ్చింది!

బ్యాంకువారేవో వివరాలడిగి, కావలసిన ఫారాలలో వేలిముద్రలు తీసుకున్నారు. ఇలా వరుసగా, ఆ గ్రామ రైతాంగం నుండి దరఖాస్తు ఫారాలు నింపి, సంతకాలు తీసుకున్నారు.

ఆ రైతులందరికీ రెవిన్యూ ఆఫీసునుండి సర్టిఫికేట్లూ, డీ.ఆర్.డి.ఏ నుండి సబ్సిడీ శాంక్షనింగు ఫారాలూ తెప్పించుకోమనీ, అవొచ్చాక బ్యాంకుకు రమ్మని చెప్పి- బ్యాంకు వారు వెళ్లిపోయారు !

o o o

గవర్మెంటిచ్చిన బియ్యం పొద్దుటి తోటయిపోనాయి. రాత్రికేటి సెయ్యడం ? సేటపట్టుకొని ఎవులి గడపెక్కడం ? పిల్లలిద్దరికీ రొండ్రోజుల కొంచి వొంటిల బాగునేదు. ఎంకప్ప డాట్రు మందివ్వకముందే డబ్బులడుగుతన్డు. ఇంటిల గింజనేదు. సేతిల కానీ నేదు.

కన్నోరింటి కెలిపోదునంతే—ఇదిగో వత్తాది లోన్సు, అదిగో ఇళ్ళు పడిపోయినదానికి డబ్బు....అంతన్నారు. అదిగాక రేసను కార్డులిత్తారు, ఆటిమీద అన్నీ సప్లీ జేత్తారట, ఇవన్నీ యిక్కడ్నుండెలిపోతే ఇవ్వరాట ! యేటిదారి దేవుడా ! తనకేటిదారి ?—అని ఇలాగ, పడిపోయిన ఇంటిజాగాలో లేపిన పందిరికింద చిట్టెమ్మ గొంతుకూర్చోని, రెండు కాళ్ళల్లో మొహంపెట్టి విచారిస్తోంది !

కరణం వొచ్చాడు.

“చిట్టెమ్మా ! రేపు తాశీల్దారొస్తున్నాడు. ఇసక మేటలు ఎత్తటాన్కి అప్పు ఇస్తామని బేంకువాళ్ళొచ్చారుగదా. ఆ అప్పుకి గవర్నమెంటు సబ్సిడీ అంటే తెల్సుగదా ? రూపాయికి అర్ధ సబ్సిడీ,మిగిలిన అర్ధరూపాయే నీకు అప్పు. అదే తీర్చుకోవాల !

ఆ సబ్సిడీకి తాశీల్దార్ గారు ఇసక మేటలు సూడాల. కాయితాలు రాయాల. ఆ కాయితాలు మీదాఫీసుకి పంపాల. అవి ఆ మీదాఫీసునుండి ఇంకొక్కడికి పంపాల. ఇలాగ కాగితాలన్నీ ఆఫీసులూ తిరిగి బేంకుకి రావాల. అప్పుడు బేంకువారు అప్పిస్తారు. గవర్నమెంటు సబ్సిడీ ఇస్తాది. ఇన్ని దిక్కులు కాయితాలు తిరగాలంటే, కాయితాలకి కాళ్ళున్నాయా ?

లేవుకదా ! కాళ్ళులేని కాయితాల్ని మనం కదపాల. కదపాలంటే, కాయితాలన్ని ఆఫీసులాతిరిగి నీ చేతికి సబ్బినీ, అప్పా రావాలంటే నూటికి ముప్పయి రూపాయిల కర్సవుతాది. నీకు తెలన్దికాదు. నీను అడిగింది యెక్కువకాదు. అంచేత, నీ కాగితాల ఖర్చుకి లెక్క ప్రకారం అరవై వుండాల. రేప్పొద్దుట జమచేసి తీసుకురా !" అని చక్కగా చెప్పేసి, చిలకొట్టుకొంగు చేతిలో ఎత్తిపట్టుకొని, మరోచేత్తో సిగరెట్టు పూరాగా లాగుతూ, వీథిదారి పట్టాడు కర్నం !

కర్నం మాటల్తో—చిట్టెమ్మకు రాత్రిబియ్యం కంటే, పిల్లల మందులకంటే ముఖ్య సమస్యగా అరవై రూపాయల సంపాదన ఎలా ? అన్నదే కన్పించింది. ఆలోచించింది. చూసింది....

సావుకారి శంకరయ్య కనిపిత్తండు. కాపోతే, వొడ్డీ అడుగుతాడు. అడగనీ, మరేటీ సెయ్యిడం ?—అని బయల్దేరింది సావుకారి ఇంటికి !

ముప్పయ్యేళ్ళ కిందట, తొలిసారి పంచాయితెన్నికలపుడు, అత్తోరి ఊరిలో నున్న శంకరయ్య సావుకార్ని ఓటెయ్యడానికి పనికొస్తాడని కుటమాంతోటి తీసుకొచ్చాడు నారాయణసోమి నాయుడు.

ఓట్లయి పోనాయి. నారాయణసోమి నాయుడు గెలిచాడు. శంకరయ్య ఊరొదల్లే ! నారాయణసోమి నాయుడినీ వొదల్లేదు ! "రాజుకి మంత్రినాగ, జెమీందారుకి దివాను నాగ, తెల్లదొరకి నల్లగుమాస్తా నాగ....అలాగ ఇలగాక పోయినా, కోమిటోడినాగ...నాను నీకు పనికొత్తాను. మీరు నాకు బతుకు పెట్టండి"— అన్నాడు.

నారాయణసోమి నాయుడూ కాదన్లేదు. అప్పుడు కాఫీ దుకాణ మెట్టాడు శంకరయ్య !

టీలూ...టిఫిన్లిచ్చి; నూలూ, నూకలూ సంపాయించినారు. నూలూ, నూకలూ అమ్మి కోళ్ళూ గొర్రెలూ కొన్నాడు. కోళ్ళూ గొర్రెలూ అమ్మి, బళ్ళూ బర్రెలూ సంపాయించాడు. బళ్ళు, బర్రెలతోటి మళ్ళూ, మిల్లూ

గడించి, పులిపాక మిద్దె: మిద్దె మేడా అయి, వరదొచ్చినా—ఇన్‌కమ్ టాక్సు వారికి దొరకని ఆస్తిలా...వుండిపోయింది ధృఢంగా శంకరయ్య మేడ !

అలాంటి మేడలో, ఒకగదిలో సోఫాలో కూచున్నాడు శంకరయ్య ...చిట్టెమ్మ వెళ్లేసరికి ! చిట్టెమ్మ వొచ్చినపని చెప్పింది. బేంకీలోన్సు రాగానే ఇచ్చేస్తానని, వంద రూపాయలు అప్పు అడిగింది.

శంకరయ్య ఆలోచించాడు.—వంద రూపాయలో లెక్క-గాదు. గానీ, యేటయివేజుంది దీనికాడ ? అయివేజు లేకుండా అప్పు ఇవ్వటం అతని ఇంటా, వంటాలేదు ! గనుక అయివేజుండాల ! అయితేటుంది ?

మూడుకాసుల ముక్కు-పుడక కనిపిత్తంది. ఇసకదిబ్బయిపోయిన మడిసెక్క-, కూలిపోయిన ఇంటి జాగా ! యివిగాక మరేట్లేవు !— సెర్లోని సేపలన్నీ సెల్లిపోనాయి. ఇకనేటి తింతావే గుడ్డికొంగా—అన్నట్టిగుంది చిట్టెమ్మ !

ఇసకదిబ్బ పడిపోయిన మడిచెక్క-ని యింతకుముందు చిట్టెమ్మ పెనిమిటి ఎప్పడడిగినా అమ్మెజూపాడుగాడు. కూలీనాలీ జేసుకు, దానిమీద గడిపేసే వోడు. ఇదిగీనాడు అవకాశం వొచ్చింది. ఉపయోగించుకోవాల- అనుకున్నాడు సావుకారి !

అంచేత, రాక్షసుడు మారువేషంలో సాయంజేసేట్లుగా అయివేజు అడక్కు-ండా, నోటు రాసుకోకుండా అప్పు ఇవ్వడానికే నిర్ణయించు కున్నాడు.

"సూడు కోడలా ! సిట్టెమ్మా ! డబ్బుకి సేనా యిబ్బందిగుంది.నీకు వారదవల్ల ఎలాగ నష్టవయ్యిందో, అంతకి మరంత నష్టం నాకు జరి గింది. అయితే, నీకు మగదిక్కు- పోనాది. పిల్లలు చిన్నోలు. ఇదిగి టయింల నువ్వడిగితే లేదన్నేను. అయితేటి సెయ్యడం ? నాకాడలేవు.

మీ అత్తని అడిగి సూత్తానుండు...." అని లోనకెళ్ళి ఓ క్షణం తర్వాత తిరిగొచ్చి: వందరూపాయలిస్తూ—

"కోదలా! మీ అత్త తిరపతి మొక్కు డిబ్బీలోంచి తీసిచ్చింది. అవసరంలో వున్నావనిచ్చింది. వొడ్డీ నెలకి పది రూపాయలు. ఎంతైనా, ఆ ఏడుకొండలోడి ముడుపుకే! జాగర్తగ,వొడ్డీతోటితీరిసీయాల సుమా..." అని పదే, పదే హెచ్చరించాడు.

కరణమూ, వెంకప్ప డాక్టరూ లాక్కోగా మిగిలిన డబ్బులో పూటభత్యం పుల్ల వెలిగించింది.

డబ్బు వొసూల్జేసిన డాక్టరుజబ్బు వొదలగొట్టలేదు. కొడుకుఒకసారి స్పృహ కోల్పోయాడు. ఒళ్ళు చల్లబడిపోయింది. చిట్టెమ్మ గొల్లుమని యేడుస్తూ, వెంకప్ప డాక్టరు దగ్గరకెళ్తే మరో యాభయి తెమ్మన్నాడు. అప్పుడు మళ్ళీ ఈ సావుకార్నే బతిమాలితే యాభయి రూపాయలిచ్చాడు. కొడుకు రెండురోజులకి తేరుకున్నాడు.

వొస్తావొస్తాదని చూస్తోన్న చంద్రంపేట రైతుల కోరోజు బ్యాంకు నుంచి కబురొచ్చింది—లోన్సు యిస్తున్నాం రమ్మని!

అందరితోపాటు చిట్టెమ్మా వెళ్ళింది పిల్లల్నితీసుకొని! పొద్దుటినుంచి, సాయంత్రందాకా యేవేవో ఫారాల్లోన వేలిముద్రలు తీసుకొని, వాటికి కరణం చేత సాక్ష్యం సంతకాలు పెట్టించి, సాయంత్రం చిట్టెమ్మ చేతిలో తొంభయి రూపాయిలు పెట్టారు బ్యాంకువారు!

చిట్టెమ్మ కాళ్ళకిందనేల తిరుగుతున్నట్లు, గుండెల్లోన ఇంజన్లు పరిగెడుతున్నట్లు అయ్యింది.—ఇదేటండి బాబో? అని మేనేజర్ని అడిగితే—

"చూడమ్మా! నీకు సబ్సిడీ భాగాన్నే ఇచ్చాము. అప్పుకాదు. నీకిచ్చిన డబ్బు మరి తీర్చక్కర్లేదు. ఒట్టినే వొచ్చింది. వెళ్లెళ్ళు...." అని వెళ్ళమన్నాడు.

తొంబయి రూపాయిల్తోటి మడిసెక్కలపడిన ఇసుకదిబ్బ ఎత్తించడమా ? సావుకారి బాకీ తీర్సడమా ? బియ్యం గింజలు కొనడమా ? యేటిసెయ్యిడం ? ఎటుకీ సాలని డబ్బుతోటి ఏటి జెయ్యాల ?— అని విచారిస్తోంది చిట్టెమ్మ !

ఆరాత్రే, కొడుక్కి మళ్లీ వాంతులూ, విరేచనాలూ ఆరంభించాయి. పట్నం తీసుకెళ్లాల ! కలరావొచ్చింది !- అని వెంకప్ప డాక్టరనటంతో, చేతిలో బ్యాంకు వారిచ్చిన డబ్బుతో కొడుకుని తీసుకొని ఆసుపత్రికెల్లింది. రెండు రోజులాస్పత్రిలో కంటికి కునుకులేక, కడుపుకి తిండి లేక కొడుక్కి సపర్యలు జేసింది. చేతిలో డబ్బు ఖర్చు జేసింది ! కొడుకు బతికి బట్ట కట్టాడు. ఇంటికి తీసుకొచ్చింది.

అయిపోనాది. ఇత్తారన్న సబ్సీటిలోన్సు ఇగిరిపోనాది- పెనమ్మీద నీటి సుక్కనాగ ! అంతిత్తారింతిత్తారని కర్నం గండడు అరవయి రూపాయిలు గుటకేస్నాడు. ఆ నీలా, యీ నీలా పోస్సి కొడుక్కి జబ్బు ఎక్కువ జేస్సి ఎంకప్ప గండడు కొంత ఎగరేస్సినాడు, ఇసుక దిబ్బ అలగే వుండి పోనాది. ఈ సావుకారి అప్పు దానికి జత అయినాది. ఇంటిల బియ్యం గింజకి దారి నేదు.

ఈ బాధలూ, బందిలూ పడమని, యీ అడివిల నన్నొదిలీసి నావుర దేవుడా ! పోయినోడివి నన్నైనా పట్టుకుపోనేదు. నిన్నొదిలీసి నన్ను ఎత్తుకు పోనాది గాదా వోరద ? అంటూ పతిదేవుణ్ణి, యితర దేవతలనూ తల్చుకు, కుమిలి కుమిలి యేడుస్తూ కూర్చుంది ఇంటి గడపలో చిట్టెమ్మ !

బియ్యం నింపిన సంచీ, వాటి మీద పాత చీరలు రెండూ వేసి, పట్టుకొని వొచ్చాడు... అప్పుడే చిట్టెమ్మ అన్న ! అన్నను చూసి చిట్టెమ్మ భోరున యేడ్చింది.

"అన్నా.... నా బతుకు సూడురోరన్నా ! ఇదిగీ బదవల్సీను మరి

ఎత్తలేదన్నా. ఒంటి దాన్ని ఎటు సాగగల్నన్నా ? నాను దిక్కు లేని దాన్నయి పోనానురన్నా." ఏడుస్తూ బాధలన్నీ చెప్పుకుంది. అన్న ఏవేవో ఓదార్పు మాటలు చెప్తున్నాడు.

ఇంతలో తలయారి వచ్చి, చిట్టెమ్మని పంచాయితీ పెద్దలు నారాయణస్వామి నాయుడింటికి రమ్మన్నారని చెప్పాడు.

ఎందుకు ? అని అడిగితే, సావుకారి బాకీ గురించాట- అని చెప్పాడు. బాకీ ఏమిటని అడిగిన అన్నకు, జరిగినదంతా చెప్పింది. అన్నా, చెల్లెలిద్దరూ వెళ్లారు !

నారాయణస్వామి నాయుడూ, కరణం, మునసబు, శంకరయ్య సావుకారీ గాక, మరో ఇద్దరు రైతులూ కూర్చున్నారు !

ఏ విషయమైనా, దాన్ని ముందుగా ప్రారంభించేవాడు కర్ణమే. ఇప్పుడూ కరణమే ప్రారంభించాడు.

"చిట్టెమ్మా ? శంకరయ్య సావుకారికి నువ్వు బాకీ అట ?" అడిగాడు.

ఎంతబాకీయో అనలేదు. ఫలానా ఇంతనీ అనకుండా చిట్టెమ్మ గూడా తలూపింది- ఔను, బాకీ యే- అన్నట్లుగా !

"బేంకీ లోన్సు రాగానే ఇచ్చేస్తానని తీసుకున్నావట ?"

చిట్టెమ్మ మళ్లీ మరో మారు తల ఊపింది.

తల ఊపిన తర్వాతనే మళ్లీ కర్ణం ప్రారంభించాడు.—

"బ్యాంకులోను అందుకున్నావు గానీ సావుకారికివ్వ లేదుగదా ?" అనడిగాడు.

చిట్టెమ్మ యిప్పుడు తల ఊపలేదు, తలలోపలి విషయాలు చెప్పింది.

"ఔను బావ్, ఇవ్వలేదు. ఒకటనుకుంటే ఇంకోటయినాది. లోన్సా

త్తాది, సావుకారి బాకీ తీరిపోద్ది. ఇసక దిబ్బ ఎత్తించివొచ్చు- అనను కున్నాను. లోస్సు సగంకి సగం తెగ్గోస్సినారు. ఆ సగం డబ్బులా పిల్లడి జబ్బుకి కర్సయిపోనాయి. ఇప్పుడేమో అప్పు అలగుండిపోనాది. ఇసకలగపడున్నాది. యేటి సెయ్యాడమో బోదపడ్డంలేదు…” అని చెప్పింది.

“ఎవులి బాధ లాలకుంతాయి. సృష్టిల బాధలేని జీవరాశి యేదేనా వుందేటి ? నేదు కదా ! సురందికనీ, మన బాధలకి అంతెక్కడ ? యిక్కడ గాదు- అక్కడా…వొల్లకాటి దిబ్బల !” అని వేదాంతమూ, వైరాగ్యమూ చెప్పి-

“ఈలోగా, జీవుడున్నంత దాకా ఈదులాడాల ! ఈ యీదులాటల మనిసికి మాట ముఖ్యం ! సచ్చినా, బతికినా మాటొక్కటే మిగల్తాది. ఫలానా వోడు, లేదా ఫలానాపిల్ల పరువుగా బతికింది. పరువుగా సచ్చింది. మాటమీద నిలబడేది అని అనిపించుకోవాల ! ఔను కదా ?” అని చిట్టె మ్మను అడిగాడు.

ఆమెచేత- ఔను- అన్నట్లు తల ఊపించుకొని మళ్లీ ప్రారంభించేడు—

“అంచేత, చిట్టెమ్మీ ! నీ బాధలు నీ కున్నాయి. కాదన్ను. నీకు తగని ఆపదలొచ్చినాయి. అయితేటి జేత్తాం ? నువ్వు సావుకారి బాకీ కాదనీగలవా ? లేదనీగలవా ? అన్లేవు. నువ్వలాగ ఎగమెడ్డీవనే నమ్మకం తోటే, నోటు రాయకుండా, అయివేజు లేకండా అప్పు ఇచ్చాడు. నిజమే నంతావా ? మరిప్పుడు, నువ్వు మాట ప్రకారం అప్పు తీర్చియ్యాలకదా ? తీర్సపోతే, అది న్యాయం గుంతాదా ? చెప్పిమీ…” అని అడిగాడు నారాయణస్వామి నాయుడు.

సావుకారి ముంగిపోతునాగ కూకొని, ఈల్లిద్దరి సేత కథ నడిపిస్తం డేటి ?- ఈ పెనకాతల యేటున్నాదో-అని అర్థంకాక, చిట్టెమ్మ నివ్వెర పోతూ నారాయణస్వామి నాయుడి ప్రశ్నకు అనువులన లేదూ, మినువులన లేదు !

"యేటంటావ్ చిట్టెమ్మా ? బాకీ మాట చెప్పవా ?'' హెచ్చరించాడు కర్నం.

"బాకీ మాట నిజిమేని కర్నంబావ్. కాదన్ను. కాని, అప్పు ఎందుకు పోనానో, ఆ సొమ్ము ఎవులెవులి కిచ్చానో నీకూ తెల్సు. తొలీటి వొంద ఓడి, అసివయి నీ కిచ్చాను. మిగిలిందీ, తరాత ఓడిన యాభయ్యీ ఎంకప్పకిచ్చాను. అంతొత్తాది, ఇంతొత్తాది అనుకున్న లోన్సు తొంబయి రూపాయిలొత్తే, అవి పట్నం ఆసపత్రి లిచ్చీసినాను. ఇప్పుడేటున్నాది ? ఈయేడు ఊరుకుంతే, ఒచ్చే యేడు ఎలాగొకనాగ తీర్సేత్తాను." అంది చిట్టెమ్మ.

''ఎలాగ తీరుస్తావు ? అనడగను. గానీ, ఇప్పుడు నువ్వున్న పరిస్థితిల ఒచ్చేయేటికి అప్పు తీర్సలేవు. ఎందుకంటే, తిండికి గింజలేదు. పొలమా ఇసకమేటయిపోనాది. ఇసకెత్తితే గానీ అది పంటకి పనికి రాదు. ఏ పంటా రాకపోతే, ఏ ఆధారమూ లేకపోతే ఎలాగ బతుకుతావు ? అప్పెలాగ తీర్సుతావు ? తీర్చలేవు. ఆలోచించు చిట్టెమ్మా..." అని నారాయణస్వామినాయుడు వ్యవహారాన్ని సావుకారు కన్నేసిన మడిసెక్క మీదకి లాక్కెల్తూ మాట్లాడాడు !

అంతవరకూ సుట్టపోడిలాగ, చెల్లెలికి తోడుగా వచ్చి, నిల్చొని అంతా విన్న చిట్టెమ్మ అన్న -

"అయితేటంతారు నాయుడుగారూ, యేటిసెయ్యమంతారో మీరే సెప్పండయితే..." అని అడిగాడు.

"అలు సెప్పడమేటి ? అప్పు తీసుకున్నది నీ చెల్లెలు. తీరుత్తాననో, ఎగమెద్దేత్తాననో నీ సెల్లిలే అనాల !" సావుకారి కోపంగా అన్నాడు.

"ఒచ్చే యేడు తీరుత్తానన్నాది గాదా ?"

"కాదీ యేదే తీర్సియ్యాల..."

"నిలబడిన పాటుగ కక్కమంటే డబ్బనుకున్నావా ? కడుపులోని గెంజనుకున్నావా ?

"తీర్సలేనిది ఓడుకోగూడదు..."

"ఓడుకొని, అదొక్కర్తె తినీలేదు ఊరోలు తినీసారు..."

ఇలా సావుకారీ, చిట్టెమ్మ అన్నా మాటకు మాటా కేకలేసు కుంటుంటే, - ఊరోలు తినీసారనేసరికి కరణానికి కోపమొచ్చింది.

"ఊరోలంటే ఎవులు ? నాకిచ్చిందనేనా ? నాకు వొట్టి పుణ్యాని కివ్వలేదు. సబ్సిడీ కోసం నాకిచ్చింది. కొడుక్కోసం డాక్టరుకిచ్చింది." అన్నాడు కరణం.

మాటకు మాట పెరగటం, వ్యవహారం మధ్య చిట్టెమ్మ అన్న దూరటం సహించలేని నారాయణస్వామి నాయుడు -

"ఇంతకీ అప్పు ఇప్పుడు తీర్చుతావా ? లేదా ? చెప్పు..." అన్నాడు.

"ఇప్పుడు తీర్చలేనని చెప్పింది గదా !" చిట్టెమ్మ అన్న.

"ఇప్పుడు తీర్చనంటే న్యాయంగాదు. పోనీ, తీర్సపోతే అప్పుకి నోటు రాస్సి, అయివేజయినా యేదేనా ఇవ్వాలిగదా ?" అడిగాడు నారాయణ స్వామి నాయుడు.

"అయివేజు ఏటున్నాది దానికాడ ? పడిపోయిన ఇల్లు, ఇసక దిబ్బయి పోయిన మడిచెక్క ! యేటి కావాల అయివేజు ?"

"ఇల్లు తీసుకొని, పిల్లల్తోటి ఈదిలోకి నెట్టమని యే పెద్దమనిసీ చెప్పలేడు. మరా, మడిసెక్క మిగిలుంది. అది రాసుకో సావుకారీ..." అన్నాడు నారాయణ స్వామి నాయుడు

"కర్రని ఇరగనివ్వరు, పాముని సవ్వనివ్వరు మీ పెద్దలు. ఇసక దిబ్బనీ అయివేజు దీసుకోని యేటీ జేత్తాను ? ఇప్పుడీవిడ యివ్వాలసిన నూటయేభయికి తోడు మరో రెండొంద లేసుకొని, ఆ ఇసక ఎత్తించాల ! ఇలాంటేపారం జేత్తే మరి బతకక్కర్లేదు.

పోనీ, ఒకటి సేత్తాను. ఇసకెత్తించకుండా ఆ మడి ఎవులికీ

పనికి రాదు. నీను యిసకెత్తిస్తాను. రొండొందల రూపాయిల సిల్లరే అవుతాది యిసకెత్తడానికి ! పోనీ చిల్లర కేటి రొండొందలను కోండి. ఆ రెండొందలూ, అప్పు నూట యాభయ్యీ, వడ్డీతోటి కలిపి నాలు గొందలకి నోటు రాసుకొని, దానికయివేజుగా ఆ మడి తీసుకుంతాను. ఆ పిల్ల యే సంవత్సరం తేలికయి, అప్పు నాలుగొందలూ వొడ్డీ తోటి తీర్సేత్తాదో, ఆ సంవత్సరమే ఆ మడి ఆ పిల్లకిచ్చేత్తాను. అలగైతే, ఒప్పు కుంతాను.” అన్నాడు సావుకారి, వల సరిగ్గా చేస్తూ !

“బాగుంది. సావుకారి సెప్పిందీ బాగుంది. నువ్వెలాగూ ఆ ఇసకెత్తించలేవు. సావుకారి మడి బాగుజేయించుతాడు. నువ్వు వొచ్చే యేడు గాపోతే, యింకో యేడు అప్పుతీరిస్సి, మడి ఇడిపించుకో. ఏటంతావు సిట్టెమ్మ....” అని అడిగాడు నారాయణ స్వామి నాయుడు.

సావుకారి ఉరులు, పెద్దల సలహాలు అర్థమైన చిట్టెమ్మకు దుఃఖం పొంగింది.

“యేటన మంతారు పెద్దల్లారా, యేటనమంతారు ? నిలబడిన పాటుగ అప్పు కక్కమంతే, కక్కపోతే మడిసెక్క రాసుకుంతామని ఉరులు సుట్టేసి ఊసులాడితే, యేటనమంతారయ్యల్లారా ? వొంద రూపాయిల సబ్బీటికి, నాలుగొందల ప్రోనోటు పీకసుట్టుకొని, మడిసెక్కని మింగిత్తుంటే యేటనగల్ను బావ్ !

బాబులారా ! నా సిన్నప్పుడు బడేట్లతల్లో అమ్మవోరో యేదో వొచ్చి కోళ్లు సచ్చిపోయాయి ! అప్పుడు, మా పెద్దలు ఆ తల్లికి, ఆ అమ్మ వోరికి మొక్కుమొక్కి, పెద్దొరస కోడిపెట్టనో, పుంజునో బలిచ్చుకొనీ వోల్లు ! ఆ తల్లి శాంతించి, మిగతా కోళ్లని బతికిస్తాదని !

అయితే, ఆ తల్లే - కోడి గాదు గొర్రె బలియ్యమంతే ఎవులేనా యేటంతారు ? కోళ్ల కోసం గొర్రెలు బలియ్యమంతే, ఆ తల్లిని ఎవులేనే

దేవతంతారా ? దెయ్యమంతారా ? సెప్పండి బాబులా?..." అని చిట్టెమ్మ బాధనీ, కోపాన్నీ వెళ్లగక్కిండి.

"అయితేటంతావు ? మీ మంతా గొర్రెలు బలడిగే దెయ్యాలమనా నీ వుద్దేశం ? నీ మాటలు నా కర్థమయి పోనాయి! ఇక మరి లాభంలేదు, లాభంలేదు. నీకు మర్యాదగా అడగటం, నువ్వేమో శాస్త్రాలిలా, పురాణాలా సెప్పడం - యికసాలు

రేపీయాలకి సావుకారి బాకీ వొడ్డితో గలిపి రొండొందలా ఇచ్చి తీరాల ! లేదంతే, ఆ మడిసెక్క అయివేజు రాయించనయినా ఇచ్చి కోవాల ! ఈ రెండిటిల, యేదో ఒకటి జరగపోతే వొప్పుకునేది లేదు. చెంద్రం పేట పెద్దలంటే చెల్లని కాణీలనుకున్నావు గావాల ఎల్లు...ఎల్లు? పెద్దలమాట గాదని, ఈ ఊరిల ఎలాగ బతుకుతావో, ఆ మడిసెక్క నీకెలాగ దక్కుతాదో సూస్తాను ఎల్లు ఎల్లే సిట్టెమ్మా..." అని కూర్చున్న చోటనుండి లేచి, కోపంతో గట్టిగా కేకలేయ సాగాడు నారాయణ స్వామి నాయుడు.

చిట్టెమ్మ నారాయణ స్వామి నాయుడు మాటలకి భయపడిందో, లేదో గానీ చిట్టెమ్మ అన్న మాత్రం భయపడ లేదు. వరదలా, కరువులా, ఘోరాలా అనేకం తట్టుకోగలిగే వటవృక్షంలా ధీమాగా నిల్చున్నాడు !

నిల్చున్నవాడు - "బాబో, పంచాయితీ పెద్దగారు, సావుకారి బాకీ తీర్నపోయినా, మీ పెద్దల తీర్పు పాటించక పోయినా నా సెల్లెల్ని యీ ఊరిల బతకనియ్యరా ? దాని భూమి దానికి దక్కనియ్యరా ? నిజమే. మీకిప్పుడా బలముంతే వుండొచ్చు. కాదన్ను గానీ బావ్... నా సెల్లెలు ఆడిన మాటలు తప్పుగావు. ఆటిలో తప్పులేదు.

తొంబయి రూపాయల సబ్బిడీకి, నాలుగొందల ప్రోనోటు పీకమీద కత్తి లాగ పెట్టి, వున్న మడిచెక్కని నొక్కడానికి సావుకారివైపు నిల్సొని మీరిచ్చిన తీర్పులో వున్నాది తప్పు ! సర్వం వారదల పోగొట్టుకొన్న,

ఎలా బతకాలని కుమిలిపోతున్న నా చెల్లెలి లాటోల్ల నుంచి...సబ్సిడీలకనీ, దానికనీ దీనికనీ లంచాలు గుంజుకునే కర్నానిది తప్పు !! రంగు నీళ్ల ఇంజక్షనిచ్చి, జబ్బుకంటా డబ్బు గుంజడానికే పూనుకున్న డాక్టరుది తప్పు !!!

అయినా, దంచిందానికి బుక్కిందే కూడన్నట్టుగా, దొరికిన కాడకి దోసుకోటమే ఒప్పు అంతారు మీరు. మీరీ ఊరికి పెద్దలు ! మీకంటే మరింత తెలియనోల్లు, లౌక్యమెరిగినోల్లూ, ఈ దేశానికిపెద్దలు ! యీ ఊరిని మీరెలాగ యేల్తన్నారో యీ దేశాన్ని ఆ పెద్దలలాగే యేల్తన్నారు ! ఏలనల ఏడు వొంశధారకి యింకోఒకఏడు గోదారికి, వోర దొస్తేఇంకోఏడు ఇంకోనదికి ! ఇలాగేవరదలూ, వుప్పెనలూ ! మరోవైపు వర్నాల్లేక కరువులూ, కాటకాలు !

వొరదలొత్తాయి. కరువులొత్తాయి. ప్రజలు గురవుతా వుంటారు. ఇలా గురయినప్పుడల్లా - ఏలినవారు ఏవేవో వాగ్దానాలూ, సహాయాలూ ప్రకటిస్తా వుంటారు. ఆ వాగ్దానాలూ, ఆ సహాయాలూ, ఆ రాయితీలూ యివిగో నా సెల్లెలికి అందిన తీరుగే అందుతన్నాయి. నా సెల్లెలికి జరిగిన తీరుగే అందరికీ జరుగుతంది.

అయితే, ఎల్లకాలం యీ తీరు సాగిపోదు. ఇల్లుకూలిన జనం, బిళ్లూ బిక్కులూ పోయిన జనం, భూమి బుగ్గయిన జనం, బతుకు బలయిన జనం "కో...బలీ" అంటూ ఉధృతంగా, వంశధారకంటే ఎక్కువగా పొంగి పొర్లుతారు. అప్పుడు మీ పెద్దలకు యే దిక్కూ వుండదు.

నా సెల్లెలికి తోడు అన్నగా నేనున్నాను. నా కంటే అండగా జనమున్నారు. మా నుండి తప్పించుకోలేని రోజొస్తాది. దాన్ని కాసుకోండి !'' అని హెచ్చరించి, మరక్కడ నిల్చోకుండా చెల్లెలు చేయి పట్టుకొని తీసుకొని పోసాగాడు.

బుగతల పశువుల సాలల్లోంచి గాలివాటం ఒక్కసారిగా పెరిగింది. ఆ గాలికి, పిల్లలెక్కడో పాడుతోన్న పాట -

"రైతు అన్నలు గలిసిన - నిన్ను రాణిని జేసే రాజ్యమొస్తది, పిల్లో" ఊరిలోకి విన్పిస్తోంది !